సాక్షి


కుమురం భీం

ఆదివారం । 6 । ఏప్రిల్ । 2025



సెలవు చావుకొచ్చింది!

ఆదిలాబాద్ జిల్లా మావల మండలంలో ఇద్దరు చిన్నారులు నీట మునిగి మృత్యువాత పడ్డారు. ఈత సరదా విద్యార్థుల ప్రాణం తీసింది. 8లో▸



మొక్కలకు నిప్పు..!

అవగాహన లేక రైతులు మొక్కలకు నిప్పు పెడుతున్నారు. వాంకిడి నుంచి జంబుల్‌ధరి వరకు వెళ్లే రహదారికి ఇరువైపులా మొక్కలు కాలిపోయాయి. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం

39.5 /24.8

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. గాలిలో తేమ తగ్గుతుంది. వేడి, ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. రాత్రి కూడా వేడి గాలి వీస్తుంది.

న్యూస్‌రీల్

రేపటి నుంచి కందుల కొనుగోళ్లు నిలిపివేత

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 7 నుంచి కందుల కొనుగోళ్లు నిలిపివేస్తున్న మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని జైనూర్, ఆసిఫాబాద్ కేంద్రాల్లో ఫిబ్రవరి 2 నుంచి కొనుగోళ్లు చేపట్టామన్నారు. వర్షాకాలం సీజన్‌లో 435 మంది రైతుల నుంచి 2,204 క్వింటాళ్ల కందులు కొనుగోలు చేసినట్లు వెల్లడించారు.

సన్నబియ్యంతో పేదల జీవితంలో సంతోషం



లబ్ధిదారు ఇంట్లో సన్నబియ్యంతో భోజనం చేస్తున్న కలెక్టర్, అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: పేదల కడుపు నింపేందుకు ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యంతో ప్రజల జీవితంలో సంతోషం వెల్లివిరుస్తుందని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. ఆసిఫాబాద్ మండలం ఆర్ఆర్ కాలనీకి చెందిన తాక్సండే శంకర్ ఇంట్లో శనివారం అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి సన్నబియ్యంతో వండిన భోజనం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 314 రేషన్ దుకాణాల ద్వారా మూడు వేల మెట్రిక్ టన్నుల సన్నబియ్యం ఉచితంగా పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. అర్హులందరికీ సన్న బియ్యం అందజేస్తామని స్పష్టం చేశారు.

ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

మంచిర్యాలఅర్బన్: ఈ నెల 7నుంచి ప్రారంభమయ్యే స్పాట్ వాల్యుయేషన్‌కు మూడేళ్ల నుంచి పదో తరగతి బోధన అనుభవం కలిగిన టీచర్లను ప్రధానోపాధ్యాయులు విడుదల (రిలీవ్) చేయాలని డీఈవో యాదయ్య సూచించారు. మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో ఉపాధ్యాయులు ఆయా సబ్జెక్టుల్లో బోధనలో అనుభవం ఉండి, మూల్యాంకనం చేసే వారు బోధన, అనుభవ సర్టిఫికెట్ ప్రధానోపాధ్యాయుల ద్వారా తీసుకురావాలని సూచించారు. మూల్యాంకన కేంద్రంలోకి సెల్‌ఫోన్లకు అనుమతిలేదని తెలిపారు. హెచ్‌ఎంలు పాఠశాలల్లో ఎస్ఏ-2 పరీక్ష నిర్వహణకు కనీస ఉపాధ్యాయులు ఉండే విధంగా చూసుకోవాలని పేర్కొన్నారు. స్పాట్ వాల్యుయేషన్ విధుల్లో పాల్గొనే టీచర్లందరూ ఏసీసీ కాన్వెంట్ హైస్కూల్‌లో ఈ నెల 7న ఉదయం 8గంటలకు రిపోర్టు చేయాలని ఆదేశించారు.

ఎల్సీ యాప్‌తో ప్రమాదాల నివారణ

ఆసిఫాబాద్‌అర్బన్: విద్యుత్ వినియోదారులకు మరింత నాణ్యమైన సేవలందించడం, ప్రమాదాల నివారణ కోసం ఆన్‌లైన్ ఎల్సీ(లైన్ క్లియర్) యాప్ ప్రవేశపెడుతున్నట్లు ఆసిఫాబాద్ సర్కిల్ ఎస్ఈ రాథోడ్ శేషారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్సీ తీసుకుని పనిచేసే సమయంలో మానవ తప్పిదాలతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఒక ఫీడర్‌కు బదులు మరో ఫీడర్ ఎంచుకోవడం, పంపిణీ వ్యవస్థను సరిగా గుర్తించుకోకపోవడం, సమాచార లోపం, ఇతర కారణాలతో సిబ్బంది ప్రమాదాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. వీటన్నింటినీ నివారించేందుకు ఆన్‌లైన్ ఎల్సీ యాప్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. యాప్ వినియోగంతో మానవ తప్పిదాలు పూర్తిగా నివారించవచ్చని స్పష్టం చేశారు.

ఘనంగా అశోక చక్రవర్తి జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

వాంకిడి(ఆసిఫాబాద్): మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో శనివారం సామ్రాట్ అశోక చక్రవర్తి జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ కలింగ యుద్ధానంతరం సామ్రాట్ అశోక చక్రవర్తి ప్రపంచానికి శాంతి మార్గం చూపించారని తెలిపారు. ప్రజల కోసం సేవా కార్యక్రమాలు నిర్వహించారని, 84 వేల బౌద్ధ విహారాల్లో శిలా శాసనాలు చెక్కించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు అశోక మహోల్కర్, అంబేడ్కర్ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్, నాయకులు జైరాం, ప్రతాప్, రోషన్, విజయ్, మనోజ్, ప్రశాంత్, విఠల్, రమేశ్ పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణం..
చూతము రారండి

గ్రామాలన్నీ శ్రీరామ నామస్మరణతో మారుమోగుతున్నాయి. ప్రతీ ఆలయంలో ఆ కోదండ రాముడి పేరే వినిపిస్తోంది. శ్రీరామ నవమి సందర్భంగా ఆదివారం నిర్వహించే శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవానికి పుష్పాలంకరణ, రంగవల్లులు, విద్యుద్దీపాలతో ఆలయాలు ముస్తాబయ్యాయి. 'సీతారాముల కల్యాణం చూతము రారండి' అంటూ ఆహ్వాన పత్రికలు ఇప్పటికే పంపిణీ చేశారు. అంగరంగ వైభవంగా జరిగే పెళ్లివేడుకను తిలకించేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. నీడ కోసం షామియానాలు, పచ్చని పందిర్లు వేశారు. తాగునీటిని అందించడంతోపాటు అన్నదానం నిర్వహించనున్నారు. – కౌటాల/దహెగాం/రెబ్బెన/ఆసిఫాబాద్/కెరమెరి

- ముస్తాబైన ఆలయాలు
- భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు



కౌటాల: విద్యుత్ వెలుగుల్లో శ్రీకోదండ రామాలయం



కౌటాల శ్రీకోదండ రామాలయంలో అలంకరించిన సీతారాముల విగ్రహాలు

☞ శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించే శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవానికి రెబ్బెన మండల కేంద్రంలోని సీతారామాంజనేయస్వామి ఆలయం, గోలేటి టౌన్‌షిప్‌లోని శ్రీకోదండ రామాలయాలు ముస్తాబయ్యాయి. రంగు రంగుల విద్యుద్దీపాలతో అందంగా అలంకరించడంతో దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి. నంబాల, తక్కళ్లపల్లి గ్రామాల్లోనూ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గోలేటిలోని కోదండ రామాలయంలో వేడుకలకు బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్‌రెడ్డి హాజరుకానున్నారు. గోలేటి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలు, తలంబ్రాలు తీసుకురానున్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద ఎదుర్కోలు కార్యక్రమాన్ని చేపట్టిన అనంతరం పట్టువస్త్రాలు సమర్పించేందుకు ఏర్పాట్లు చేశారు. వేలాదిగా తరలివచ్చే భక్తుల కోసం సౌకర్యాలు కల్పించారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారి వెంట ఏర్పాటు చేసిన మైకులతో ప్రత్యేక ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

☞ దహెగాం మండల కేంద్రంతోపాటు లగ్గాం, చిన రాస్పెల్లి, కుంచవెల్లి, గిరవెల్లి గ్రామాల్లోని ఆలయాలు శ్రీరామ నవమికి ముస్తాబయ్యాయి. మండల కేంద్రంలోని శివాలయంలో సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఆలయం ఎదుట తాటి ఆకులతో పందిరి, ఆవరణలో టెంట్లు వేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆలయ అర్చకుడు పరమేశ్వర్ తెలిపారు.

☞ జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ కోదండ రామాలయం శ్రీరామ నవమి వేడుకలకు ముస్తాబైంది. మూడు రోజులుగా ఆలయ ప్రాంగణంలో భూమి చదును చేసి, షామియానాలు, చలువ పందిళ్లు వేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. జన్కాపూర్ నుంచి ఆసిఫాబాద్ వరకు రాష్ట్రీయ రహదారి పొడవునా సీతారాముల కల్యాణ గీతాలు ఆలపించేందుకు మైక్‌లు ఏర్పాటు చేశారు. శనివారం పాల పొరక కార్యక్రమం చేపట్టా రు. ఆదివారం ఉదయం జిల్లా కేంద్రంలోని రాజపేట తుజాల్‌పూర్ మురళీగౌడ్ నివాసం నుంచి రామాలయం వరకు సీతారాముల ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. ఉదయం 4 గంటలకు సుప్రభాత సేవ, 4.30 గంటలకు సీతారాములకు అభిషేకం, 9 గంటలకు ఆసిఫాబాద్ నుంచి ఆలయం వరకు సీతారాముల ఉత్సవ విగ్రహాలతో హనుమాన్ దీక్షాస్వాముల శోభాయాత్ర, 11.59 గంటలకు పునర్వసు నక్షత్రయుక్త అభిజిత్ లగ్న సుముహూర్తన సీతారాముల కల్యాణం నిర్వహించున్నారు. అనంతరం అన్నదానం చేపడుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

☞ కౌటాల మండల కేంద్రంలోని శ్రీకోదండ రామాలయం శ్రీరామనవమి వేడుకలకు ముస్తాబైంది. 36 ఏళ్లుగా కౌటాల రామాలయంలో కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం 11.52 గంటలకు శ్రీరామచంద్రస్వామి – సీతామహాదేవి వేద పండితుల సమక్షంలో కల్యాణం జరిపించనున్నారు. మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల నుంచి వందలాదిగా భక్తులు తరలిరానున్నారు. మూడు రోజులుగా ఆలయ కమిటీ సభ్యులు ప్రచారం చేస్తున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అధిక సంఖ్యలో తరలిరావాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు భట్టమేకల గట్టయ్య తెలిపారు.

☞ కెరమెరి మండల కేంద్రంలోని శివాలయం సీతారాములు కల్యాణానికి ముస్తాబైంది. ఇప్పటికే ఆలయం ఎదుట టెంట్లు వేశారు. పల్లెర్ల మధుకర్, గ్రామ పటేల్ వాడై సోనేరావు ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. ఇప్పటికే సీతమ్మ ఆభరణాలు కొనుగోలు చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు కల్యాణం జరపనున్నారు. గ్రామంలో పెళ్లిపత్రికలు పంచిపెట్టారు. మధ్యాహ్నం సీతారాముల ప్రతిమలతో శోభాయాత్ర నిర్వహించనున్నారు.



దహెగాం ముస్తాబైన ఆలయం



విద్యుత్ కాంతుల్లో జన్కాపూర్ ఆలయం



కెరమెరి: శివాలయంలో ఏర్పాట్లు



రెబ్బెన : అలంకరించిన ఆలయ ముఖద్వారం

ఆరో రోజుకు శ్రీరామ రక్ష స్తోత్ర పారాయణం



పారాయణం చేస్తున్న మహిళలు

ఆసిఫాబాద్‌అర్బన్: శ్రీరామ నవరాత్రుల్లో భాగంగా ఆరోరోజు శనివారం జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడలతో మహిళలు శ్రీరామ రక్ష స్తోత్ర పారాయణం చేశారు. మహిళలు తాంబులాలు, పసుపు, కుంకుమలు ఇచ్చిపుచ్చుకున్నారు. తీర్థప్రసాద వితరణ చేపట్టారు. పట్టణంలోని జన్కాపూర్ కోదండ రామాలమంలో నిర్వహించే సీతారాముల కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో రావాలని కోరారు.

జగ్జీవన్‌రామ్ జీవితం ఆదర్శప్రాయం

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: స్వాతంత్ర్య సమరయోధులు, సంఘ సంస్కర్త, మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జీవితం ఆదర్శప్రాయమని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో శనివారం షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సజీవన్, ఆర్డీవో లోకేశ్వర్ రావు, వివిధ సంఘాల నాయకులతో కలిసి పూల మాలలు వేసి నివాలర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ అణగారిన వర్గాల కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. రాజ్యాంగ సభ సభ్యుడి, వివిధ శాఖల మంత్రిగా, ఉప ప్రధానిగా సేవలందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, విద్యుత్ శాఖ అధికారి శేషారావు, ఎమ్మార్పీఎస్ నాయకులు రేగుంట కేశవ్‌రావు, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, మాజీ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, కుల సంఘాల నాయకులు మాటూరి జయరాజ్, రూప్‌నార్ రమేశ్, గంగుబాయి. బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ స్ఫూర్తితో ముందుకు సాగుదాం

ఆసిఫాబాద్‌అర్బన్: మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ స్ఫూర్తితో ముందుకు సాగుదామని అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలో పోలీసు కార్యాలయంలో శనివారం బాబు జగ్జీవన్ రామ్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదనపు ఎస్పీ మాట్లాడుతూ వెనుకబడిన వర్గం నుంచి వచ్చిన బాబు జగ్జీవన్‌రామ్ సమర్థవంతంగా మంత్రి పదవులు నిర్వర్తించారని తెలిపారు. ఆత్మవిశ్వాసంతో అడుగులు వేస్తూ నిస్వార్థ నాయకుడిగా గాంధీతో కలిసి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనారని పేర్కొన్నారు. వ్యవసాయశాఖ మంత్రిగా భారత ఆహార గిడ్డంగులు ఏర్పాటు చేశారన్నారు. మహనీయులు దేశానికి అందించిన సేవలను ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ అడ్మిన్ పెద్దన్న, ఆర్ఎస్సైలు రాజేశ్, లవన్, సందీప్, కిరణ్, ఏఆర్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు

హాస్టల్‌లో దాహం కేకలు

'మూడు రోజులు కరెంట్ లేదు సార్.. ప్రాబ్లం ఉంది.. బోరు పనిచేస్తలేదు. మొఖం కూడా కడుక్కోలేదు. తాగేందుకు కూడా నీళ్లు లేవని చెబుతున్నా పట్టించుకుంటలేరు..' అంటూ జైనూర్ మండలం పాట్నాపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలల విద్యార్థినులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఆశ్రమ పాఠశాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో బోర్ పనిచేయడం లేదు. కొందరు బాలికలు గ్రామంలోకి వెళ్లి గిన్నెల్లో నీటిని తెస్తున్నారు. వంద మందికి పైగా విద్యార్థినులు ఉండగా, నీటిని బాటిళ్లలో నింపుకుని జాగ్రత్తగా వాడుకుంటున్నారు.

- కెరమెరి



ఉద్యోగి యాదిలో క్రీడాపోటీలు

- సింగరేణి ఆధ్వర్యంలో ఏటా వేణుగోపాల్ మెమోరియల్ పోటీలు
- పలు జిల్లాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): గని ప్రమాదం నుంచి తోటి ఉద్యోగులను రక్షించే ప్రయత్నంలో అసువులు బాసిన ఉద్యోగి యాదిలో బెల్లంపల్లి ఏరియా సింగరేణి యాజమాన్యం ఏటా రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ క్రీడాపోటీలు నిర్వహిస్తోంది. రాష్ట్రం నలుమూలల క్రీడాకారులకు ఆహ్వానం పంపుతోంది. ఈ ఏడాది కూడా సింగరేణి యాజమాన్యం గోలేటి టౌన్‌షిప్‌లోని శ్రీ భీమన్న స్టేడియంలో 36వ వేణుగోపాల్ మెమోరియల్ వాలీబాల్ పోటీలు నిర్వహిస్తోంది. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. మూడు రోజులుగా భీమన్న స్టేడియంలో క్రీడాకారుల కేరింతల మధ్య కొనసాగుతున్న పోటీలు శనివారం ముగిశాయి.

ఎనిమిది జట్ల మధ్య పోటీలు

శ్రీభీమన్న స్టేడియంలో నిర్వహిస్తున్న వేణుగోపాల్ మెమోరియల్ ఇన్విటేషన్ వాలీబాల్ పోటీలకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ఎనిమిది జట్లు పాల్గొంటున్నాయి. హైదరాబాద్, బెల్లంపల్లి, మంచిర్యాల, నస్పూర్, దేవాపూర్, కాగజ్‌నగర్, కోటపల్లి, గోలేటి ప్రాంతాల నుంచి జట్లు పోటీలకు హాజరయ్యాయి. టోర్నమెంట్‌లో ఫైనల్ మ్యాచ్‌తో కలిపి 15 మ్యాచ్‌లు ఆడాల్సి ఉండగా.. సెమీ ఫైనల్ వరకు పోటీలను లీగ్ పద్ధతిలో, సెమీ ఫైనల్ తర్వాత నాకౌట్ పద్ధతిలో నిర్వహించారు. పూల్ ఏ నుంచి హైదరాబాద్, కాగజ్‌నగర్ జట్లు, పూల్ బీ నుంచి బెల్లంపల్లి, దేవాపూర్ జట్లు సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. ఫైనల్‌లో బెల్లంపల్లి జట్టుపై హైదరాబాద్ జట్టు విజయం సాధించింది.



విజేతగా నిలిచిన హైదరాబాద్ జట్టుతో సింగరేణి అధికారులు

ఎవరీ వేణుగోపాల్..?

బెల్లంపల్లి ఏరియాలో ఒకప్పుడూ అన్ని భూగర్భ గనులే ఉండేవి. గతంలో సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడంతో తరుచూ గని ప్రమాదాలు చోటు చేసుకునేవి. 40 సంవత్సరాల క్రితం మార్గన్‌ఫిట్ గనిలో ఆక్సిజన్ అందకపోవడంతో ఉద్యోగులు ప్రమాదం బారినపడగా.. అదే గనిలో ఓవర్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న వేణుగోపాల్ ప్రాణాలకు తెగించి తోటి ఉద్యోగులను రక్షించే ప్రయత్నం చేశాడు. కొంతమంది ఉద్యోగులను కాపాడినప్పటికీ చివరికి తనకే ఆక్సిజన్ అందకపోవడంతో ప్రాణాలు కోల్పోయాడు. మృతి చెందిన కార్మికులకు సింగరేణి సంస్థ టెర్మినల్ బెనిఫిట్స్ అందిస్తుంది. కానీ వేణుగోపాల్ కుటుంబ సభ్యులు ఆ బెనిఫిట్స్ తీసుకోకుండానే వారి స్వగ్రామానికి వెళ్లిపోయారు. అతడికి చెల్లించాల్సిన డబ్బులు సంస్థ వద్దే ఉండిపోయాయి. వేణుగోపాల్ స్వతహాగా మంచి క్రీడాకారుడు. ఫుట్‌బాల్, హాకీ, క్రికెట్‌లో ప్రతిభ చూపేవాడు. దీంతో తోటి ఉద్యోగ క్రీడాకారులు సంస్థ అధికారులను కలిసి వేణుగోపాల్‌కు గుర్తుగా పోటీలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఆ విధంగా వేణుగోపాల్ మెమోరియల్ క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. నాడు ప్రారంభమైన ఈ క్రీడాపోటీలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన పలువురు క్రీడాకారులను 'సాక్షి' పలకరించగా తమ అభిప్రాయాలు పంచుకున్నారు.

రెండుసార్లు కెప్టెన్‌గా..



బెల్లంపల్లి ఏరియా యాజమాన్యం వేణుగోపాల్ మెమోరియల్ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామని ఇన్విటేషన్ పంపించడంతో మా జట్టు సభ్యులం ఈ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చాం. ఇప్పటివరకు నేను జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ వాలీబాల్ జట్టుకు రెండుసార్లు కెప్టెన్‌గా వ్యవహరించా. జూనియర్స్, యూత్ నేషనల్స్ పోటీల్లోనూ పాల్గొన్నా.

– అనుదీప్, హైదరాబాద్ జట్టు

స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం



నాకు చిన్నతనం నుంచి క్రీడలు అంటే ఎంతో ఇష్టం. ఆ ఇష్టంతోనే వాలీబాల్‌పై పట్టు సాధించాను. నాలుగుసార్లు జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నాను, స్పోర్ట్స్ కోటాలోనే గతేడాది టీఎస్‌పీఎస్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సైతం సాధించా. ప్రస్తుతం ఆదిలాబాద్‌లో విధులు పనిచేస్తున్నా.

– పి.అంజి, బెల్లంపల్లి జట్టు

క్రీడలతో ఉపయోగం



ప్రతీ క్రీడాకారుడు తనకు నచ్చిన ఆటలో నైపుణ్యం సాధించాలి. క్రీడలతో ఎన్నో ఉపయోగాలు ఉంటాయి. నాకు వాలీబాల్ అంటే ఎంతో ఇష్టం. ఎంతో కష్టపడి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు నైపుణ్యాలు మెరుగుపర్చుకున్నా. స్పోర్ట్స్ కోటాలో సివిల్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం కూడా సాధించుకోగలిగా.

– లావుడ్య రాజు, బెల్లంపల్లి జట్టు

ఇదే మొదటిసారి



వేణుగోపాల్ మెమోరియల్ ఇన్విటేషన్ టోర్నమెంట్‌లో పాల్గొనడం ఇదే మొదటిసారి. ఏరియా యాజమాన్యం ఏర్పాట్లు బాగున్నాయి. మరికొన్ని జట్లు టోర్నమెంట్‌లో పాల్గొంటే ఇంకా బాగుండేది. నేను నాలుగుసార్లు జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నాను. యూత్ నేషనల్స్ పోటీల్లో నాలుగో స్థానంలో నిలిచాం.

– ఎండీ షారుఖ్, హైదరాబాద్ జట్టు

క్రీడాకారులకు అన్ని ఏర్పాట్లు



బెల్లంపల్లి ఏరియా యాజమాన్యం వేణుగోపాల్ మెమోరియల్ ఇన్విటేషన్ పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు ఇబ్బందులు లేకుండా అన్నిఏర్పాట్లు చేసింది. పోటీలకు ఎనిమిది జట్ల క్రీడాకారులు హాజరయ్యారు. అన్ని జట్లు అద్భుత ఆటతీరు ప్రదర్శించాయి. క్రీడాకారులకు ఉచిత వసతితో పాటు భోజన సౌకర్యం కల్పించాం.

– అశోక్‌కుమార్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్, బెల్లంపల్లి ఏరియా

క్లుప్తంగా

ఒకరిపై కేసు నమోదు

వేమనపల్లి: మండలంలోని మంగెనపల్లిలో శుక్రవారం పాలేరు నాయిని కన్నయ్య మృతికి కారణమైన యజమాని ఎనగంటి చిన్నన్నపై కేసు నమోదు చేసినట్లు నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. శనివారం చెన్నూర్ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

పేకాడుతున్న తొమ్మిది మంది అరెస్టు

బెల్లంపల్లి: పట్టణంలోని అశోక్‌నగర్ బస్తీలో శనివారం పేకాటస్థావరంపై దాడిచేసి పేకాడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎస్.దేవయ్య తెలిపారు. బస్తీకి చెందిన ముక్కెర వెంకటేష్ ఇంటి వద్ద కొందరు పేకాడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించిన బెల్లంపల్లికి చెందిన ముక్కెర వెంకటేష్, జంగం క్రాంతికుమార్, గొడుగు రమేష్, తొగరి సురేష్, యాదగిరి మహేష్, బాకం సుమన్, గజ్జల స్వామి, ఎరుకల శ్రీనివాస్, సుందురీ మల్లాద్రిని అరెస్టు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వారి వద్ద నుంచి 52 పేక ముక్కలు, రూ.12,550 నగదు, 7 ఫోన్లు, 5 బైక్‌లు స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

గంజాయి స్వాధీనం



వివరాలు సేకరిస్తున్న ఎస్సై విజయ్

కెరమెరి: మండలంలోని ధనోరా గ్రామ సమీపంలో ఉన్న తుమ్మగూడలో శనివారం పుస్నక తుకారాం వద్ద నుంచి రూ.6,375 విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గుంపుల విజయ్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు తుకారం ఇంటి పెరట్లో తనిఖీలు నిర్వహించగా గంజాయి మూట కనిపించిందన్నారు. నిందితుడు తుకారాంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

నిర్మల్: నర్సాపూర్ (జి) మండలంలోని చాక్‌పల్లి శివారులో 61వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... చాక్‌పల్లి గ్రామానికి చెందిన బ్యాగరి చిన్న భోజన్న ద్విచక్ర వాహనంపై వ్యవసాయ క్షేత్రానికి వెళ్తుండగా భైంసా నుంచి నిర్మల్ వైపు అతివేగంగా వెళ్తున్న కారు వెనుక నుండి ఢీకొట్టింది. ఘటనలో చిన్న భోజన్నకు తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. క్షతగాత్రున్ని నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

వేదపాఠశాల విద్యార్థి మృతిపై కేసు

బాసర: నిర్మల్ జిల్లా బాసరలోని వేద పాఠశాల విద్యార్థి మణికంఠ మృతిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. మృతిపై అనుమానాలు ఉన్నాయని మృతుని తండ్రి హనుమకొండ జిల్లా శాయంపేటకు చెందిన బండారి రాజేందర్ ఫిర్యాదు చేశారు. వేద పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సెలవు చావుకొచ్చింది!

- ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు మృతి
- ఇద్దరినీ మింగిన చెరువు
- ఆదిలాబాద్ జిల్లాలో ఘటన
- రెండు కుటుంబాల్లో విషాదం



సంజీవ్ (ఫైల్)



రాహుల్ (ఫైల్)



విలపిస్తున్న రాహుల్ కుటుంబ సభ్యులు

ఆదిలాబాద్‌రూరల్: సెలవు ఆ విద్యార్థుల చావుకొచ్చింది. ఈత సరదా ఇద్దరు చిన్నారుల ప్రాణాలు బలిగొంది. ఆదిలాబాద్ జిల్లా మావల మండలంలో జరిగిన సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీలోని వైజాగ్‌కు చెందిన కాంబ్లే దుర్గాప్రసాద్, సత్యభామ దంపతులు ఐదేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం ఆదిలాబాద్‌కు వచ్చారు. మావల మండల కేంద్రంలోని 170 కాలనీలో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారు. వారికి రాహుల్ (9) (నాలుగో తరగతి), విశాల్ ఇద్దరు కుమారులు. ఇద్దర్నీ మావల మండల కేంద్రంలోని ఎంపీపీఎస్2లో చదివిస్తున్నారు. శనివారం పాఠశాలకు సెలవు ఉండడంతో రాహుల్, విశాల్, స్నేహితుడు చిప్పకుర్తి సంజీవ్ (10)తో కలిసి ఈత కొట్టేందుకు మండల కేంద్రంలోని జాతీయ రహదారి 44కు ఆనుకుని ఉన్న ఎర్రకుంట చెరువు వద్దకు వెళ్లారు. రాహుల్, సంజీవ్ స్నానం చేసేందుకు చెరువులోకి దిగారు. విశాల్ చెరువు చుట్టుపక్కల ఆడుకుంటూ ఉన్నాడు. కొంత సేపటికి రాహుల్, సంజీవ్ నీటిలో మునిగిపోవడంతో గమనించిన విశాల్ విషయాన్ని స్థానికులతో పాటు కుటుంబ సభ్యులకు స మాచారం అందించాడు. మావల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాలను వెలికితీయించారు. పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ మార్చురీకి తరలించారు.

రెండు రోజుల్లో పుట్టిన రోజు..

గుడిహత్నూర్ మండల కేంద్రానికి చెందిన చిప్పకుర్తి రాజ్‌కుమార్ కుమారుడు సంజీవ్ నానమ్మ తారాబాయి వద్ద ఉండి మావల పాఠశాలలో ఐదోతరగతి చదువుతున్నాడు. మరో రెండు రోజుల్లో అతని పుట్టినరోజు ఉంది. ఇందుకోసం తారాబాయి తన పింఛన్ డబ్బులతో కొత్త బట్టలు కొనిచ్చేందుకు తీసుకెళ్దామని అనుకుంది. అంతలోనే స్నేహితులు రావడంతో వారితో కలిసి ఆడుకునేందుకు బయటకు వెళ్లాడు. కొద్దిసేపటికే ఈ విషాదకర వార్త తెలియడంతో తారాబాయి అక్కడికి చేరుకుని నా కోరిక తీరక ముందే వెళ్లిపోయావా.. అంటూ గుండెలు బాదుకుంటూ విలపించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. ఇరువురి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు.

వాలీబాల్ పోటీల విజేత హైదరాబాద్



రన్నరప్‌గా నిలిచిన బెల్లంపల్లి జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న జీఎం విజయ భాస్కర్‌రెడ్డి

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో సింగరేణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 36వ వేణుగోపాల్ మెమోరియల్ ఇన్విటేషనల్ వాలీబాల్ పోటీలు శనివారంతో ముగిశాయి. హైదరాబాద్ జట్టు విజేతగా బెల్లంపల్లి జట్టు రన్నరప్‌గా నిలిచాయి. నాకౌట్ కం లీగ్ పద్ధతిలో నిర్వహించిన సెమీ ఫైనల్, ఫైనల్ పోటీల్లో ఇరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. హైదరాబాద్ జట్టు అద్భుత ఆటతీరును ప్రదర్శించి విజయ కేతనం ఎగురవేసింది.

సింగరేణిలో క్రీడలకు పెద్దపీట

సింగరేణి యాజమాన్యం క్రీడలకు పెద్దపీట వేస్తోందని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం భీమన్న స్టేడియంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో పని చేసిన ఓ ఉద్యోగి పేరుతో 36 సంవత్సరాలుగా రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. క్రీడాకారుల్లో క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి ఎంతో అవసరమన్నారు. పోటీల్లో గెలుపు ఓటములు సర్వసాధారణమని, ఓటమిని కారణాలను విశ్లేషించుకుంటూ గెలుపు దిశగా క్రీడాకారులు పయనించాలన్నారు. అనంతరం విజేతగా నిలిచిన హైదరాబాద్ జట్టుకు ట్రోఫీతో పాటు రూ.30 వేల నగదు, రన్నరప్‌గా నిలిచిన బెల్లంపల్లి జట్టుకు ట్రోఫీతో పాటు రూ. 20 వేల నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహెరా, పర్సనల్ మేనేజర్ రెడ్డి మల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారులు శ్రీనివాస్, ప్రశాంత్, ఆర్జీ–2 ఏరియా స్పోర్ట్స్ సూపర్‌వైజర్ నరేందర్‌రెడ్డి, బెల్లంపల్లి రీజియన్ స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కిరణ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

బాసరలో విద్యుత్ దీపాల ఏర్పాటు



సాక్షి ఎఫెక్ట్..

'భక్తుల భద్రత గాలిలో దీపమే' శీర్షికన 'సాక్షి'లో శనివారం ప్రచురితమైన కథనానికి బాసర గ్రామ పంచాయతీ ఈవో ప్రసాద్‌గౌడ్ స్పందించారు. బాసర ఆలయంతో పాటు ప్రధాన కూడళ్లు, రైల్వే స్టేషన్, గోదావరి నది స్నాన ఘట్టాలు, తదితర ప్రాంతాల్లో 'సాక్షి' పరిశీలన చేపట్టింది. రాత్రి సమయంలో చీకట్లో ఉన్న పరిస్థితులను కథనంలో ప్రచురించింది. స్పందించిన అధికారులు రైల్వే స్టేషన్, బస్టాండ్, ప్రధాన రోడ్ల వద్ద వీధి దీపాలు ఏర్పాటు చేశారు. – భైంసా/బాసర



రైల్వేస్టేషన్ వద్ద విద్యుత్ దీపాలు

కళాకారులకు ఉపాధి కల్పిస్తాం

- టీవీ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేశ్



మాట్లాడుతున్న నాగబాల సురేశ్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని కళాకారులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని తెలంగాణ టీవీ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగబాల సురేశ్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పిక్చర్ టైం థియేటర్‌లో ఔత్సాహిక కళాకారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో యువ దర్శకుడు దండనాయకుల మానస్‌తో కలిసి మాట్లాడారు. జిల్లాలో అనేక ప్రకృతి వనరులు ఉన్నాయని, వీటిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటే సినిమా, సీరియల్స్ షూటింగ్‌లకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఇప్పటి వరకు 27 సీరియల్స్, 927 డాక్యుమెంటరీలు నిర్మించినట్లు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి 110 మందిని బుల్లితెరకు పరిచయం చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరింత మందికి అవకాశం కల్పిస్తామన్నారు. షూటింగ్ కోసం జిల్లాకు వచ్చే కళాకారులకోసం ప్రత్యేక స్టూడియోలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇదే విషయాన్ని సీఎంతో పాటు, సినిమా ఇండస్ట్రీ చైర్మన్ దిల్‌రాజు దృష్టికి తీసుకెళ్లానన్నారు. సమావేశంలో నవజ్యోతి సాంస్కృతిక సారథి అధ్యక్షుడు ధర్మపురి వెంకటేశ్వర్లు, సభ్యులు రాధాకృష్ణాచారి, జిల్లాలోని కళాకారులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజన్న



కావటి రాజన్న

జన్నారం: పీఏసీఎస్ ఉద్యోగుల సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా జన్నారం మండలంలోని పొనకల్ పీఏసీఎస్ కార్యదర్శి కావటి రాజన్న శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంచిర్యాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా మచ్చా మధుకర్, ప్రధాన కార్యదర్శిగా విష్ణువర్ధన్‌రావు, సలహాదారులుగా రాజిరెడ్డి, లక్ష్మారెడ్డి, సత్యనారాయణను ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కూరగాయలు అమ్మేందుకు వచ్చి మృత్యుఒడిలోకి..

- విద్యుత్‌షాక్‌తో యువరైతు మృతి



పొచ్చన్న (ఫైల్)

తాంసి: కూరగాయలు విక్రయించేందుకు వచ్చి విద్యుత్ షాక్‌తో యువరైతు మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాంసి మండలంలోని పొన్నారి గ్రామానికి చెందిన ఆశిలీ పొచ్చన్న (38) తన కున్న ఎకరంతో పాటు మరో నాలుగెకరాలు కౌలుకు తీసుకుని 20 ఏళ్లుగా కూరగాయలు సాగు చేస్తున్నాడు. వాటిని జిల్లా కేంద్రంలోని రైతు బజార్‌కు తీసుకెళ్లి విక్రయిస్తుంటాడు. శుక్రవారం సాయంత్రం కూరగాయలు విక్రయించడానికి జిల్లా కేంద్రంలోని రైతు బజార్‌కు వచ్చాడు. విక్రయించిన అనంతరం రాత్రి సమయంలో విద్యుత్‌బల్బును తొలగించే క్రమంలో షాక్ కొట్టడంతో పక్కనున్న రాళ్లపై పడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని భార్య మమత ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సునీల్ తెలిపారు.

- తరలివచ్చిన ఉమ్మడి జిల్లా ఆదివాసీలు



చర్చావేదికలో పాల్గొన్న ఉమ్మడి జిల్లా ఆదివాసీలు

హీరాసుకా జెండా తొలగింపుపై చర్చావేదిక

ఇంద్రవెల్లి: మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన పర్ధాన్ సమాజ్ కుల గురువు హీరాసుకా స్మారక జెండాను ఇటీవల గుర్తు తెలియని దుండగులు తొలగించారు. దీనిపై శనివారం కేస్లాపూర్ నాగోబా దర్బార్ హాల్‌లో నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని నాలుగు సగల ఆదివాసీలతో చర్చావేదిక నిర్వహించారు. నాగోబా ప్రాంగణంలో హీరాసుక జెండాను ఏర్పాటు చేయడం సరికాదని, వేరేస్థలంలో ఏర్పాటు చేయాలని తీర్మాణించారు. ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్ ఇంద్రవెల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి కేస్లాపూర్ నాగోబా దర్బార్ హాల్‌లో కొనసాగుతున్న ఆదివాసీల చర్చావేదికను ఉట్నూర్ సీఐ మొగిలి, ఎస్సై దుబ్బాక సునీల్ ద్వారా తెలుసుకున్నారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి

వాంకిడి: ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్సై పోశెట్టి తెలిపిన వివరాల మేరకు సిర్పూర్(టి) మండలంలోని మేడ్‌పెల్లి గ్రామానికి చెందిన మడావి రాజ్‌కుమార్ (22) శుక్రవారం వాంకిడి మండలంలోని బండకాస గ్రామంలో ఉన్న బంధువుల ఇంట్లో పెళ్లికి వచ్చాడు. పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై వాంకిడికి వచ్చి వెళ్తుండగా నవేధరి గ్రామ సమీపంలో ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో రాజ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ కుమ్రె విజయ్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

అర్ధరాత్రి వరకు ఆందోళన

బాధిత కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించాలని మృతుని బంధువులు, ఆదివాసీ సంఘాల నాయకులు మృతదేహంతో రహదారిపై ఆందోళన చేపట్టారు. దహన సంస్కారాలకు రూ. 50 వేలు, పరిహారం కింద రూ.3 లక్షలు ఇచ్చేందుకు ట్రాక్టర్ యాజమాని ఒప్పుకోవడంతో ఆందోళన విరమించారు.

రోడ్డు ప్రమాదంలో రాజస్థాన్ వాసి...

నేరడిగొండ: మండలంలోని కుప్టి జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన దిలీప్ గుజర్ (20) కుప్టి వద్ద గల ధాబా హోటల్‌లో పనిచేస్తున్నాడు. హోటల్ యజమాని పని నిమిత్తం రాజస్థాన్‌కు వెళ్తున్న క్రమంలో అతన్ని బస్సు ఎక్కించి హోటల్‌కు వెళ్తుండగా రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని బోథ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



సరస్వతీ కాలువలో గుర్తు తెలియని మృతదేహం

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ శివారులోని సరస్వతి కాలువలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని వయస్సు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉంటుందన్నారు. రాచాపూర్ కారోబార్ రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై శ్రీనివాస్ వర్మ, ప్రొబేషనరీ ఎస్సై జుబేర్ తెలిపారు.

సిర్పూర్(టి): మండలంలోని టోంకిని గ్రామ సమీపంలో పెన్‌గంగ నదిలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. మృతునికి సుమారు 50 ఏళ్లు ఉంటాయన్నారు.

నూతన గనులు ఏర్పాటు చేయాలి



డైరెక్టర్‌ను సత్కరిస్తున్న ఐఎన్టీయూసీ నేతలు

శ్రీరాంపూర్: సింగరేణిలో నూతన గనులను ఏర్పాటు చేయాలని ఐఎన్టీయూసీ నేతలు శనివారం కంపెనీ డైరెక్టర్‌ను కోరారు. ఆర్జీవన్ ఏరియాలో పర్యటన నిమిత్తం వచ్చిన సింగరేణి డైరెక్టర్(పా) కొప్పుల వెంకటేశ్వర్లును ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ బీ.జనక్‌ప్రసాద్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీలో సుదీర్ఘకాలం ఒకేస్థానంలో పనిచేస్తున్న అధికారులను బదిలీ చేయాలన్నారు. ప్రస్తుతం పదేళ్లు దాటిన వారిని బదిలీ చేయాలని నిర్ణయం తీసుకున్నారని, దీన్ని ఐదేళ్లకు కుదించాలన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా ఉద్యోగుల రక్షణ, సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అధికారుల పనితీరును అంచనా వేసే విధంగా పర్ఫార్మెన్స్ ఇండికేటర్ విధానాన్ని అమల్లోకి తీసుకురావాలన్నారు. అనంతరం డైరెక్టర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, ధర్మపురి, కాంపల్లి సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి లక్ష్మీపతిగౌడ్, ఆర్జీ 1 ఏరియా ఉపాధ్యక్షులు సదానందం, నాయకులు వడ్డేపల్లి దాస్, గడ్డం కృష్ణ, లింగమూర్తి, సాయి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం



మోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు



ఘర్షణకు దిగుతున్న బీజేపీ, కాంగ్రెస్ నాయకులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేటలో శనివారం రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమంలో బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కేంద్రం నిధులతోనే సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారని, అందుకు ప్రతీ రేషన్ షాపు వద్ద బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటం ఏర్పాటు చేసి క్షీరాభిషేకం చేస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ నాయకులు మోదీ ఫ్లెక్సీని తొలగించడంతో ఇరుపార్టీల నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఇరుపార్టీల నాయకులను శాంతింపజేశారు.

సింగరేణి విద్యాసంస్థల్లో నాణ్యమైన బోధన



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్: సింగరేణి విద్యాసంస్థల్లో నాణ్యమైన బోధన చేస్తున్నామని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం సీసీసీలోని సింగరేణి హైస్కూల్‌లో పదోతరగతి పరీక్ష రాసిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్, కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం నిర్వహించారు. పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జీఎం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) అరవిందరావు, పాఠశాల కరస్పాండెంట్ ఏ.రాజేశ్వర్, ప్రధానోపాధ్యాయులు సంతోష్, రిటైర్డ్ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఇంద్రప్రకాష్‌రెడ్డి, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు సమ్మయ్య, వాణిశ్రీ, రాజారెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.





సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DISTANCE EDUCATION

■ Direct Final Year BA, BCom, BSC, MA, MSc, M.Com, B.Lic, M.Lic, Btech, MBA, LLB, GNM, BAMS, DPharmacy. BPharmacy, cont: Asin academy, NZB. Cell:94400 27497. [SCA25002565]

WANTED

■ హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 18K. Ph: 9640258899, 9640468899 [SCA25002557]

■ అర్జెంట్‌గా మూతపడ్డ సర్ సిల్క్ కంపెనీకి వాచ్‌మెన్లు మరియు సూపర్‌వైజర్స్ మరియు ఫ్యాక్టరీ ఇన్‌చార్జీలు కావలెను. సిర్పూర్ పేపర్ మిల్ ప్రక్కన సర్ సిల్క్ కంపెనీ ఖాఘజ్‌నగర్ జీతం : 8000/- ఉచిత గృహ వసతి కుటుంబంతో ఉండవలెను. సంప్రదించండి : 9440050036 / 7569783139 / 9000711050 [SCA25002582]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462